క్లుప్తంగా

టీడీపీ నేతలను అరెస్ట్ చేయండి

బి.కొత్తకోట: పుల్లంపేట మండల సీపీఐ కార్యదర్శి సెల్వరాజ్‌పై దాడి చేసిన టీడీపీ నేతలను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, మండల కార్యదర్శి రఘునాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 45 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొంటున్న టీడీపీ నేతల వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొచ్చి భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్న ఆగ్రహంతో ఇంటిపై దాడి చేసి, ఆస్తులను ధ్వంసం చేశారని అన్నారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలను అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపకార వేతనాలు

బి.కొత్తకోట: ఆదిత్య కళాశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హార్సిలీహిల్స్ తరపున ఉపకార వేతనాలను శుక్రవారం అందజేశారు. తేజ, ఆకాష్, కుమార్, ఈశ్వర్, లోకేష్ కుమార్ రాజులకు రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు జి.రామచంద్రారెడ్డి, మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, దేసునందన్ పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డులపై అవగాహన

కలికిరి(వాల్మీకిపురం): నూతనంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దారు పామిలేటి అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్‌కార్డు ఇవ్వడం జరుగుతుందని, సచివాలయ ఉద్యోగులు, రేషన్ డీలర్ల సమన్వయంతో వాటి పంపిణీ చేపట్టాల్సి ఉంటుందన్నారు. పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంపిణీ చేయాల్సి ఉందని వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ తరువాత ఈ నెల 14న రేషన్ డీలర్లకు నిత్యావసరాల పంపిణీకి గానూ ఈ–పాస్ యంత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఫజులుల్లా, సీనియర్ అసిస్టెంట్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పరిరక్షణ అందరి బాధ్యత

పెద్దతిప్పసముద్రం: పురాతన ఆలయాలు, దేవాదాయ భూములను మనమంతా పరిరక్షించుకోవాలని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ విశ్వనాథ్ ప్రజలకు సూచించారు. మండలంలోని బూచిపల్లిలో వెలసిన చెన్నకేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం ఆయన పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగే ధూపదీప నైవేద్యాలు, నిత్య పూజలపై ఆరా తీశారు. ఆలయం ఆవరణంలో నూతనంగా దాతల సహకారంతో నిర్మితమవుతున్న భవనాన్ని పరిశీలించారు.

కొత్త అంబులెన్స్

ములకలచెరువు: మండలానికి మంజూరైన కొత్త 108 అంబులెన్స్‌ను మేనేజర్ సుబ్రహ్మణ్యం శుక్రవారం ప్రారంభించారు. కొత్త వాహనంతో రోగులు, ప్రమాద బాధితులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. ఇందులో అధునాతన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిబ్బంది ఉమాదేవి, షామీర్‌బాషా పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిద్దవటం: మండలంలోని మాచుపల్లి, కడప రహదారిలో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. సిద్దవటం మండల తహశీల్దార్‌కు అప్పచెప్పామని, ఇసుక డంపింగ్ ప్రాంతాలపై నిఘా పెట్టి అక్రమ ఇసుక రవాణ జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

యూరియా వాడకం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రమణరావు

పీలేరు: పంటల సాగులో యూరియా వాడకం తగ్గించాలని ఏడీఏ వై.వి.రమణరావు అన్నారు. మండలంలోని కంభంమిట్టపల్లెలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు రెండు సంచుల ఎరువు మూడు విడతల్లో వాడాలని సూచించారు. ఒక సంచి యూరియా బదులు 500 మిల్లీల నానో యూరియా వాడుకోవాలని సూచించారు. ఈ ఏవో రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

రామసముద్రం: మండలంలోని రైతులకు ఒక బస్తా చొప్పున యూరియాను తహసీల్దారు అజారుద్దీన్, ఏవో జాఫర్ శుక్రవారం పంపిణీ చేశారు. రామసముద్రంలో 290, చొక్కండ్లపల్లిలో 222, కెసి.పల్లిలో 222 సంచుల యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు.

బీఎంసీయూ పేరుతో రూ.6 లక్షలకు టెండర్



కొత్తగా నిర్మించినట్లు పేర్కొంటున్న భవనం

బి.కొత్తకోట: డీఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీనత ఫలితంగా అభివృద్ధిలో ఉన్న బి.కొత్తకోట మండలంలోని కోటావూరు బీఎంసీయూ (డెయిరీ)ని రెండేళ్లయినా ప్రారంభించకపోగా మళ్లీ రూ.6 లక్షల నిధుల కోసం యత్నాలు సాగిస్తున్న ఉదంతం ఇది. 2007లో కోటావూరు పంచాయతీకి సంబంధించి కాండ్లమడుగు పంచాయతీ కార్యాలయంలో బీఎంసీయూ ప్రారంభించారు. రెండేళ్ల కిందటి వరకు బీఎంసీయూ అక్కడే కొనసాగింది. డెయిరీ నుంచి వెళ్లే వృథా నీరు వెళ్లే స్థలంలో ఇంటి నిర్మాణం జరగడంతో నీళ్లు వెళ్లే మార్గం లేదంటూ డెయిరీని శాశ్వతంగా మూసేశారు.

నూతన షెడ్ నిర్మాణం ఎప్పుడో..?

అయితే కోటావూరు బీఎంసీయూ నిర్వహణకు మదనపల్లె మార్గంలోని చెరువులో నిర్మించిన వీఓ భవనం వెనుక కొత్తగా రేకుల షెడ్డు నిర్మించారు. ఇపుడు అదనపు పనుల పేరుతో రూ.6 లక్షలు మంజూరు చేయాలని మండల సమాఖ్య ద్వారా ఇటీవల మళ్లీ ప్రతిపాదనలు పంపారు. ఇప్పటి వరకూ అధికారులు రూ.12.90 లక్షల పనులకు అనుమతి ఇవ్వగా, ఇటీవల అదనంగా మరో రూ.3 లక్షలు పెంచుకున్నట్లు తెలిసింది. ఇదిగాక తాజాగా ఇంకో రూ.6 లక్షలు అవసరమని, ఓ డెయిరీ అధికారి ప్రతిపాదించారని పేర్కొంటూ జిల్లా అధికారులకు లేఖ పంపారు. కోటావూరు డెయిరీ ఖాతాలో 2024లో రూ.10 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.లక్ష మాత్రమే ఉందని, మిగిలిన నిధులను సీఐఎఫ్ ఖాతా నుంచి తీసుకునేందుకు అనుమతి కోరుతూ లేఖ పంపినట్లు తెలుస్తోంది. అయితే దీనికి ఇంకా అనుమతి లేదని సమాచారం. ఈ నిధులతో చేపట్టాల్సిన పెద్ద పనులు లేకున్నా కేవలం పెయింటింగ్, వైరింగ్ కోసమే ఇంతపెద్ద మొత్తంలో కావాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై జిల్లా అధికారులు స్వయంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

అంతా ప్రైవేట్‌దే..!

ప్రభుత్వ నిధులను ఖర్చు చేసేటప్పుడు అధికారులు ప్రభుత్వ శాఖలకు చెందిన ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు సిద్ధం చేయించి టెండర్ల ద్వారా పనులు అప్పగించాలి. లక్షల విలువైన నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. ఇవేవీ లేకుండానే ఓ ప్రైవేటు ఇంజినీర్ ద్వారా అంచనాలు వేయించి దాన్నే ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకోగా, రూ.11 లక్షల పనులను మరో ప్రైవేటు వ్యక్తికి అప్పగించారు. పనులు చేసేందుకు కాగితంపై ఒప్పందం చేయించుకున్నట్లు సమాచారం. పనులు చేశారని లక్షలు చెల్లించగా, ఇంకో రూ.1.50 లక్షలు చెల్లించాలని అధికారులే చెబుతున్నారు. అయితే వెలుగు అధికారులు నిర్మించామని చెబుతున్న భవనం చెరువులో ఉందని, ఆ స్థలం తాము అప్పగించలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. అంటే ఈ భవన నిర్మాణ పరిస్థితి ఏమిటో జిల్లా అధికారులే పరిశీలించి తేల్చాల్సి ఉంది.

మంజూరు కాలేదు

కోటావూరు బీఎంసీయూ కోసం కొత్తగా రూ.6 లక్షల నిధుల మంజూరుకు అధికారులు అనుమతి ఇవ్వలేదు. డెయిరీ భవనం పనులు ఇంకా పూర్తి కాలేదు. – రాజేశ్వరి, ఏపీఎం

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ రాజారెడ్డి

మదనపల్లె రూరల్: ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రాజారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కాలేజీల వద్ద శుక్రవారం సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న, మోటార్ బైక్‌లను శబ్దం చేసుకుంటూ, వేగంగా నడుపుతున్న విద్యార్థులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఐ రాజారెడ్డి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు, యువత చదువు, కెరీర్‌పై దృష్టి పెట్టి చక్కగా చదువుకోవాలని, ఘర్షణలు, గొడవల్లో తలదూర్చి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హెచ్చరించారు. మోటార్ సైకిళ్ల వేగంగా నడుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి, కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రహీముల్లా, శక్తి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారత కోసం సంకల్ప్ హబ్



మాట్లాడుతున్న సీడీపీఓ నాగవేణి

మదనపల్లె రూరల్: లింగ వివక్షకు కారణమవుతున్న భ్రూణ హత్యల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ నాగవేణి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మహిళా సాధికారత, జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత అంశాలపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషనల్ విద్యాధికారి మహమ్మద్ రఫీ... పీసీ పీఎన్డీటీ, ఎంటీపీ చట్టాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మాట్లాడుతూ పీసీ పీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాల సమాచారం ఇస్తే చట్టపరమైన చర్యల తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ సునీత, సీడీపీఓ సుజాత, భారతి, భాగ్యమ్మ, ప్రభావతి, చంద్రకళ, శ్వేతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు మంజూరుచేయాలి



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మదనపల్లె రూరల్: కురవంక పంచాయతీ కార్మికులకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని వార్డు మెంబర్ కృష్ణమూర్తి, బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పంచాయతీ సెక్రటరీ మంజులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోగా, సెక్రటరీని పిలిచి జీతాల బిల్లులు పెట్టుకోవాలని దురుసుగా సమాధానం ఇస్తున్నారని కార్మికులు వాపోయారన్నారు. రాజకీయ పలుకుబడి, అధికార పార్టీ నాయకుల అండ చూసుకుని కార్మికుల కడుపుకొట్టడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ నాగరాజు, హనుమంతు, కేశవ, సురేష్, బత్తాంజి, శంకర, రెడ్డెమ్మ, అలివేలు, హరి, శశికుమార్, వినయ్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణాలకు స్థల పరిశీలన



వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె: మండలంలోని దుర్గంవారిపల్లెలో ప్రయోగాత్మకంగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణ పనులకు అవసరమైన స్థలాన్ని ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రమేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మ్యాజిక్ డ్రెయిన్‌లు నిర్మిస్తామన్నారు. ఈ తరహా కాలువల నిర్మాణం తక్కువ ఖర్చుతో పూర్తవుతాయన్నారు. రూ.65 వేల డ్రెయిన్ నిర్మించవచ్చునని.. పారిశుధ్య నిర్వహణ భారం తగ్గడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, ఉపాధి హామీ ఏపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదినం



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పీలేరు: మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు ముందస్తుగా శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీలేరు యర్రగుంటపల్లె పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా సెక్రటరీ వినోద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వాల్మీకిపురంలో మాజీ ఎమ్మెల్యేను సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అమరనాథ్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, చంద్రారెడ్డి, రమణ, ప్రదీప్‌బాబు, అరుణ, హరిత, శారద, చంద్రకళ, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మదనపల్లె రూరల్: పట్టణంలోని నీరుగట్టువారిపల్లె 132/33 కే.వి. సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మదనపల్లె టౌన్, మండలం, నిమ్మనపల్లె, కురబలకోట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

యువత సేవా భావం అలవర్చుకోవాలి



ఆలీని కలిసిన పీలేరు వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకులు

పీలేరురూరల్: యువత సేవాభావం అలవర్చుకోవాలని ప్రముఖ హాస్యనటుడు ఆలీ అన్నారు. పీలేరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు హైదరాబాద్‌లో శుక్రవారం ఆలీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలీ మాట్లాడుతూ అనాథలు, దివ్యాంగులు, వితంతువుల సంక్షేమానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, కల్లూరు ఆలీ, అబీద్, రియాజ్, కలకడ కాలేషా పాల్గొన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కోఆర్డినేటర్

మదనపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను జిల్లా కో ఆర్డినేటర్ భార్గవాచారి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి.. ప్రసవానంతరం తల్లిబిడ్డలను స్వగ్రామాలకు తరలిస్తున్న వివరాలను, డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. డ్రైవర్ల పనితీరును పరిశీలించారు.

డీడీఓకు సన్మానం

సంబేపల్లె : పదోన్నతిపై కుప్పం డీడీఓగా బదిలీపై వెళ్లిన ఎన్. రామచంద్రకు శుక్రవారం మండల కేంద్రంలో సన్మానించారు. రామచంద్రకు ఇటీవల డీడీఓగా ప్రమోషన్ రావడంతో సంబేపల్లె ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు.

నేటి విద్యార్థులే రేపటి పారిశ్రామిక వేత్తలు



మాట్లాడుతున్న జయరాం

కురబలకోట: ఉద్యోగం కోసం చదివే నేటి విద్యార్థి నుండి ఉద్యోగాలు సృష్టించే రేపటి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని బెంగళూరులోని బిజినెస్ స్టాండర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జయరాం కోరారు. అంగళ్లు మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో మీరు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్నారా అంశంపై ఎంబీఏ నూతన విద్యార్థుల కోసం శుక్రవారం స్ఫూర్తిదాయక కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయ గాథలు, అగ్రగామి పారిశ్రామిక వేత్తల అనుభవాలను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. మైండ్ సెట్‌ను మార్చుకుని తీసుకున్న నిర్ణయంపై విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఎవరి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉంటుందని, ఇందుకు స్థిర సంకల్పం, ప్రావీణ్యత, క్రమశిక్షణ, టైమ్, మనీ మేనేజ్‌మెంట్, శ్రద్ధాసక్తులు లక్ష్యం దిశలో పయనించడం లాంటి వాటితో భవిష్యత్తు ముడిపడి ఉంటుందన్నారు. ఎవరికి వారు జీవిత మిషన్ (స్క్రిప్ట్)ను రాసుకోవాలని, అది రేపటి నాయకత్వానికి పునాదిగా మారుతుందని పేర్కొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున

మదనపల్లె సిటీ: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె.మల్లికార్జున అన్నారు. మదనపల్లెలోని ఏబీవీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. యువగళంలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం జీవో నంబర్ 77ను రద్దు చేసి ప్రైవేటు కాలేజీల్లో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు. మెడికల్ కాలేజీలు పీపీపీ విధానం కాకుండా ప్రభుత్వమే నడపాలన్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో సరైన వసతి సౌకర్యాలు లేవన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సాయిహితేష్, అశ్విత్, వెంకటరమణ, సాయిప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయా విద్యాలయంలో 11వ తరగతి ప్రవేశాలు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో కామర్స్ గ్రూపు నందు మిగిలిన 21 సీట్లను ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా భర్తీ చేయనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ ఎం.గీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నవోదయ విద్యాలయ సమితి నిర్ణయం తీసుకుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు నేరుగా విద్యాలయంలోని కార్యాలయంలో కలవాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వారే కాకుండా ఇతర జిల్లా వాసులు కూడా చేరవచ్చునన్నారు. కామర్స్ విత్ మాథ్స్ (ఎంఈసీ) గ్రూపునకు 10వ తరగతిలో మాథ్స్ నందు 60 శాతం మార్కులు వచ్చి వుండాలని, అలాగే పదిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. కామర్స్ వితౌట్ మాథ్స్(సీఈసీ) గ్రూపునకు మాథ్స్ నందు 45 శాతం మార్కులు, 10వ తరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోపు చేరాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవలా రచయిత మంగమ్మకు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

మదనపల్లె సిటీ: మొదటి మహిళా న్యూస్ రీడర్, ప్రముఖ రచయిత జోశిపాశెం మంగమ్మ మదనపల్లెకు వన్నె తెచ్చిందని ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి అన్నారు. స్థానిక రెడ్డీస్‌కాలనీలో డాక్టర్ జోశిపాశెం మంగమ్మ శత జయంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మంగమ్మ అంచలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారని, ఆమె రచనలు ఎందరికో స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె సాహిత్య సేవలు, పరిశోధనలు, ప్రతిభా పాఠవాలను వివరించారు. కార్యక్రమంలో భ్యాగలక్ష్మి, ధనలక్ష్మి, డాక్టర్ సరస్వతి, జయలక్ష్మి, ప్రసాదరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

సెల్వకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి



మాట్లాడుతున్న సాంబశివ, వెంకటేష్

పీలేరురూరల్: పుల్లంపేట సీపీఐ మండల కార్యదర్శి సెల్వకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడుతూ పుల్లంపేట మండలం దలవాయిపల్లె పంచాయతీలో ప్రభుత్వ ఆక్రమణపై సెల్వకుమార్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. సాయికుమార్‌రెడ్డి, అతని అనుచరులు అర్ధరాత్రి సమయంలో సెల్వకుమార్ ఇంట్లో చొరబడి ఆయనపై దాడిచేశారన్నారు. అలాగే కారు, ఆటో, వస్తువులు ధ్వంసం చేశారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మున్నా, షఫీ, బషీర్, సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రక్షణ చట్టాలు తేవాలని వినతి



జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రక్షణ చట్టం లాగానే బీసీలకు కూడా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు దోపిడీకి గురవుతూ అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారని పేర్కొన్నారు. అలాగే చట్టసభల్లో 33శాతం, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు పరుస్తామని అని కూడా వాగ్దానం చేశారని చెప్పారు. రాజ్యాంగం పరమైన చిక్కులన్నింటినీ అధికమించి బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సంచుల ఖాదర్ బాషా, యువజన సంఘం జిల్లా నాయకులు నాగార్జున, తులశీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ కేసు గుర్తింపు.. వైద్యుల చికిత్స



తొట్టెలో నీటిని పరిశీలిస్తున్న వైద్య బృందం

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, సాతుపల్లిలో డెంగీ కేసు నమోదు కావడంతో శుక్రవారం వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఓ కుటుంబంలో జ్వరం రావడంతో కడప రిమ్స్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించగా డెంగీ అని తేలిందని, దీంతో డివిజనల్ మలేరియా అధికారి ఎస్ఎస్ దాసు, మెడికల్ ఆఫీసర్ షేక్ సిరియా ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. అలాగే క్యాంపు నిర్వహించి అక్కడ వైద్యం కూడా అందించారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది లార్వా సర్వే ఫీవర్ పై సర్వే చేసి అబెట్ ద్రావణంతో పిచికారి చేయించారు. మలేరియా, డెంగీ, బోధకాలు, చికెన్ గున్యా జ్వరాలు రాకుండా ఇంటిలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మస్తాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్య విద్యపై ప్రభుత్వం కుట్ర

రాయచోటి టౌన్ : విద్య వైద్యం పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కోట్లు అర్జించడం కోసమే ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలను అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పే మాటలకు పొంతన లేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కళాశాలను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ నిర్ణయం వైద్య విద్య పేదలకు దూరం చేయాలని చర్యగా పరిగణిస్తున్నామన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా వచ్చే నాటికి రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు 2,360 సీట్లు మాత్రమేనన్నారు. జగనన్న వచ్చాక మరో 2550 సీట్లు పెరిగి 4,910 సీట్లకు పెరిగిందని తెలిపారు.